



వ్యాపారంలో పోటీ వుండటం మంచిదే కాని అది ఆరోగ్యకరంగా వున్నప్పుడే రాణింపు. అలాగాక అదుపు లేకుండా విజృంభిస్తే కొంపలు మునిగిపోతాయ్. ఇది పెద్ద పెద్ద వ్యాపారాలకే గాదు, చిన్న వాటికీ వర్తిస్తుంది.

వంక మామిడి రాధాకృష్ణ ఉరఫ్ కామరాజు రామారావు అను

“శ్రీ రమణ”

మా వూళ్ళో అప్పటిదాకా సింగారి అట్లకొట్టు వొక్కటే! కూలి చేసుకోడానికి ఎక్కణ్ణుంచో వచ్చిన నాయుదారి నాంచారమ్మ, సింగారికి పోటీగా మరో అట్ల కొట్టు పెట్టింది. కోతల సీజనులో వచ్చిన నాంచారమ్మ కూలీ లందరితో బాటు మున్సబుగారి సావిట్లో వుండేది. కోతలు పూర్తయ్యాక అందరూ వెళ్ళారు గాని నాంచారమ్మ మాత్రం దిగబడి పోయింది మా వూళ్ళోనే. మున్సబుగారి పెదపాలేరు బలవంతం మీద వుండిపోయిందని కొందరు కుర్రాళ్ళు చెప్పుకున్నారు. కాని నిజానిజాలు మనకు తెలియవు. ఓ ఉషోదయాన గ్రామ కచ్చేరి యెదర నాంచారమ్మ అట్లబట్టీ వెలిసింది. సింగారి దుకాణం రామాలయం పక్కన. రెండూ దగ్గరగానే వుంటాయి. అంతా కలిసి ఎంగిలాకు విసిరితే పడేంత దూరంలో --

వ్యాపారంలో పోటీ ప్రారంభమైంది. బొగ్గుల కుంపటిలా రగులుకుని త్వరగానే దాని తీవ్రత హెచ్చింది. అప్పటిదాకా ఏక పెనంగా సాగుతున్న సింగారికి యిది న్యూసెన్సుగా తయారైంది. అయితే సింగారి నిబ్బరమైన మనిషి కావడం వల్ల, స్థానబలిమి వుండటంచేత, పైగా అట్ల కొట్టులో విశేషానుభవం వున్నందున అట్టే డీలా పడలేదు.

సింగారిచేత అరువు లేదని ఖచ్చితంగా చెప్పించుకున్న వాళ్ళంతా నాంచారమ్మ దుకాణం దగ్గర పొద్దున్న శేవిణి వేసి పీకల దాకా తిని వెళ్తున్నారు. సింగారి దగ్గర ఆకులు తీసేస్తూ, పాసింజర్లకి మంచినీళ్ళు అందించే శీనాయ్ నాంచారమ్మ దగ్గర కుదిరాడు. ఒంటిరెక్కమీదే లాక్కొస్తోంది సింగారి.

వ్యాపారాభివృద్ధికి గాను నాంచారమ్మ హోం డెలివరీ స్కీము పెట్టింది. వూళ్ళో కాస్త పెద్దవాళ్ళ ఇళ్ళకు పొద్దున్నే అట్ల పొట్లం పంపించేసేది శీనాయ్ చేత. ఖాతాదార్లను ఆకట్టుకోడానికి, ఆకర్షించడానికీ కారప్పచ్చడితో బాటు బొంబాయి చట్నీ కూడా వడ్డించేది. పైగా చక్కని అరువు సౌకర్యం!

పది రోజులు తిరిగే సరికి నాంచారమ్మ అమ్మకాలు విపరీతమై పోయినాయి. సింగారి కూడా క్వాలిటీ పెంచటం తప్పని సరి అయింది. అసలుకి నష్టం రాకుండా చెయ్యకలిగిన మార్పులన్నీ చేసింది. బియ్యం నూకల్లో నాలుగు మినప బద్దలు వెయ్యడం తప్పని సరి అయింది సింగారికి.

నాంచారమ్మ అట్ల పెనం “సుయ్” మనడం ఆ వూరికి మేలుకొలుపుగా, కోడి కూతగా మారిపోయింది. సింగారిని దెబ్బ తీయడమే తన ఏకైక లక్ష్యంగా పెట్టుకున్నది నాంచారమ్మ. ఇంకో వారం గడిచింది. నాంచారమ్మ కాళ్ళకు వుండే వెండి కడియాలు, చెవులకు వుండాల్సిన కమ్మలూ కన్పించలేదు. సాటి ఆడదానిగా సింగారి జాలిపడ్డది. పోటీని అదునుగా తీసుకుని అప్పులు పెట్టేస్తున్నారు జనం. పైగా అప్పటిదాకా పదిపైసల అట్టుని పావలాకి మూడు అన్నది నాంచారమ్మ. అందరికీ నాంచారమ్మ కొట్టు ధర్మసత్రం అయి పోయింది.

పది రోజులయాక వో రోజు నాంచారమ్మ అట్లకొట్టు తీయలేదు. కోడి కూత విన్పించనందుకు ఖాతాదార్లు ఆదుర్దాపడ్డారు. అలవాటుపడ్డ జనం నక నక లాడారు. చివరకు నాంచారమ్మ దివాలా తీసిందని తేలింది.

రామాలయం పక్కన సింగారి పెనం దగ్గర గంభీరంగా కూర్చొని వుంది. ఇప్పుడు సింగారి అమ్మకాలు మూడింత లైనాయ్. నాంచారమ్మను చేరదీసి పిండి రుబ్బే వుద్యోగం యిచ్చింది.

“అది నీకు పోటీగా కొట్టెట్టింది కదా! దాన్నెందుకు చేరదీశావ్” అని అడిగితే-

“పాపం! అది లేకపోతే యియ్యాళ నాకింత బేరమే వుండకపోను. వేడి చమురుతో వూళ్ళో చాలామందికి పొద్దున్నే అట్లు తినే అలవాటు మప్పింది అదే కదా. అందుకే నాంచారమ్మంటేనాకు యిశ్వాసం” అని జవాబిచ్చింది సింగారి.